
సాక్షి గుంటూరు

సోమవారం । 16 । అక్టోబర్ । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 3,800 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 773 క్యూసెక్కులు విడుదల చేశారు.



పార్వతీమాతకు గాజులు సమర్పణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ దేవత దండిపార్వతీ అమ్మవారికి ఆదివారం అమరావతికి చెందిన శిష్టా లక్ష్మీ గణేష్ రెండు బంగారు గాజులను సమర్పించారు.

జాతీయస్థాయి పోలీస్ టెన్నిస్ పోటీలకు ఏఆర్ ఏఎస్పీ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా ఏఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరరావు జాతీయ స్థాయిలో జరగనున్న పోలీస్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 17 నుంచి గుజరాత్ అహ్మదాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోలీస్ టెన్నిస్ పోటీల్లో ఆయన పాల్గొననున్నారు.

న్యూస్‌రీల్

ముగిసిన ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షలు

కేంద్రాలను పరిశీలించిన ఐజీ



టీజేపీఎస్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్ పరిధిలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 7,145 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లను జారీ చేసిన విషయం తెలిసిందే. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ కలిసి ఏసీ కళాశాల, టీజేపీఎస్ కళాశాల, విజ్ఞాన్ నిరులా/డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. నిర్ణీత వేళలో అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మౌలిక వసతులు కల్పించారు. కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎస్‌ఐ అభ్యర్థుల ఎంపిక నోడల్ అధికారిణి, గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఏఎస్పీలు నాచికేత్ షెల్కే (గుంటూరు తూర్పు), ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి (పశ్చిమ), బాలసుందరరావు (ట్రాఫిక్) పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

నేడు పల్నాడు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా, నవోదయం

నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం నవోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు ఆదివారం వెల్లడించారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. హెటిరో డ్రగ్స్, యూనిటరీ మోటార్ సర్వీసెస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు వంటి కంపెనీలు హాజరవుతాయని వివరించారు. విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని వెల్లడించారు. ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమా, ఫార్మసీ, పీజీ చదివిన 18 ఏళ్ల నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని వెల్లడించారు. వారు విద్యార్హత సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయని సంజీవరావు పేర్కొన్నారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు


గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈనెల 17న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీ కోసం కళాశాల ప్రాంగణంలో జవహర్ విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంపస్ ఇంటర్వ్యూలకు బీటెక్, ఎంబీఏ మినహా పీజీ పూర్తి చేసిన 26 ఏళ్లలోపు వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఆదివారం స్థానిక ఎన్జీఓ భవనంలో జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 45 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఇ.శివశంకర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన జట్లను ఈనెల 22 నుంచి 24 వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరగనున్న 8వ అంతర్ జిల్లాల పోటీలకు పంపిస్తామని వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం




విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 526.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,598, ఎడమకాలువకు 5,874, ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 848.80 అడుగుల వద్ద ఉంది.

జయహో జగన్మాత

ఇంద్రకీలాద్రిపై భక్తి కెరటం ఎగిసిపడింది. జగన్మాత బాలాత్రిపుర సుందరీదేవిగా సాక్షాత్కరించిన వేళ.. భక్తి కోటి శరణు ఘోషతో కొండంతా మార్మోగింది. అల కైలాసం ఇల దిగి వచ్చిందా అన్నంతగా విజయవాడ నలుదిశలా నవరాత్రుల శోభ పండువెన్నెలలా ప్రకాశించింది. ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.

కొండంత వైభవం.. 'శరన్నవ' సంబరం

- వైభవంగా ఆరంభమైన దసరా ఉత్సవాలు
- బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ
- అమ్మవారికి గవర్నర్ నజీర్ దంపతుల ప్రత్యేక పూజలు
- తొలి దర్శనం చేసుకున్న సీపీ, చైర్మన్, ఈవో
- మొదటి రోజే రికార్డు స్థాయిలో భక్తులు



చూసిన కనులదే భాగ్యము.. పల్లకీపై ఊరేగుతున్న ఉత్సవమూర్తి



హారతి కనుమా.. కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులకు హారతి ఇస్తున్న అర్చకులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా మహోత్సవాలలో తొలి రోజైన ఆదివారం దుర్గమ్మను శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అశేష భక్తజనం దర్శించుకుని తరించారు. దసరా ఉత్సవాల చరిత్రలోనే తొలి రోజున రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 80 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రాత్రే నగరానికి చేరుకున్న భక్తులు తెల్లవారుజామునకే క్యూలైన్‌లోకి చేరారు. క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులను వీఎంసీ కంపార్టుమెంట్‌లోకి తరలించారు. ఉదయం 8.40 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం కాగా, సాయంత్రం 6.30 గంటల వరకు ఏకరీతిన రద్దీ కొనసాగింది. సర్వ దర్శనం క్యూలైన్లతో పాటు రూ.100, రూ.300, రూ. 500 టికెట్ క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్‌లో అడుగడునా మంచినీటి ప్యాకెట్లు, చిన్నారులకు పాలు పంపిణీ చేశారు.

మేళతాళాలతో ఊరేగింపు..

దసరా ఉత్సవాల నేపథ్యంలో తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరణ, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8.40 గంటలకు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సీపీ టి.కె. రాణా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, పోలీసు సిబ్బంది అమ్మవారిని తొలి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఇత్తడితో తయారు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా మహా మండపం ఆరో అంతస్తుకు తరలించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ప్రత్యేక లక్ష కుంకుమార్చనను ప్రారంభించారు. ప్రత్యేక కుంకుమార్చనలో చైర్మన్ దంపతులతో పాటు ఈవో దంపతులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. నగర మేయర్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.

బాధ్యత మరవొద్దు: మంత్రి కొట్టు



అధికారులందరూ బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పని చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించాలని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకొని చేసిన ఏర్పాట్లను మంత్రి ఆదివారం పరిశీలించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద క్యూలైన్లను పరిశీలించి, అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. అమ్మవారి దర్శనం చేసుకుని ఘాట్ రోడ్డు వైపు వస్తున్న భక్తులను ఆరా తీశారు. ఇంత మంది భక్తులు ఘాట్‌రోడ్డు వైపుగా ఎందుకు వస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిఫార్సులు, డ్యూటీ కార్డులపై దర్శనాలకు వచ్చే వారిని నియంత్రించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరి ఉండటంతో పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలైన్లు ఎక్కడా ఆగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఆదేశించారు. రూ. 500 టికెట్ క్యూలైన్‌లో కొన్ని లోపాలను గుర్తించామని, వాటిని వెంటనే పరిష్కరించి భక్తుల ఇబ్బందులను తొలగించామన్నారు.

నగరోత్సవం.. నేత్రపర్వం

దసరా మహోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆది దంపతుల నగరోత్సవం కనుల పండువగా జరిగింది. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవంలో తొలుత ఆది దంపతులకు ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో కేఎస్ రామారావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహామండపం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గోశాల, కనకదుర్గనగర్, దుర్గాఘాట్, ఘాట్ రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య సాగిన ఊరేగింపులో భక్తులు, ఉభయదాతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన..

ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా, ఎస్పీ రవీంద్రబాబు, డీసీపీ విశాల్ గున్ని, వెంకటరత్నం, అజిత, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించారు. ఈవో కేఎస్ రామారావులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు చేస్తూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఓ దశలో పెద్ద ఎత్తున భక్తులు ఐడీ కార్డులు ధరించి అమ్మవారిని దర్శించుకోవడంతో పోలీసులు విస్మయానికి గురయ్యారు. ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకునే వారి ఐడీకార్డులను రెవెన్యూ, పోలీసు సిబ్బంది కార్డులను తనిఖీ చేశారు. వాటిపై పేరు, ఇతర వివరాలు లేకపోవడంతో పాటు కనీసం ఫొటో కూడా లేకపోవడంతో వారి నుంచి కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి దర్శనం
- తెల్లవారుజామున 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7 గంటలకు, ఉదయం 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు అమ్మవారికి మహానివేదన, పంచహారతుల సేవ, చతుర్వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం



అతిథులకు ఆహ్వానం.. దుర్గమ్మ సన్నిధిలో గవర్నర్ దంపతులు



ధూంధాం సంబరం.. కేరళ సంప్రదాయ డప్పు కళాకారుల విన్యాసం



సాంస్కృతిక సౌరభం.. కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణి



భక్తఝరి.. విజయవాడ వినాయక గుడి వద్ద భక్తుల రద్దీ

జల భరోసా

- కృష్ణా డెల్టాకు ఇబ్బంది లేనట్టే..
- రైతులు ఆందోళన చెందొద్దు
- చివరి ఎకరాకూ నీరు
- పులిచింతల, పట్టిసీమ నుంచి తరలింపు
- కార్యాచరణ సిద్ధం చేస్తున్న జలవనరుల శాఖ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పులిచింతలలో ప్రస్తుత నీటిమట్టం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కృష్ణా, పశ్చిమ డెల్టాలో ఒక్క ఎకరా కూడా ఎండకుండా ఉండేందుకు జలవనరుల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గత వారంలో కొంత నీటి సరఫరా తగ్గడంతో అక్కడక్కడ రైతులు ఆందోళన చెందుతున్న సంగతి తెలిసిందే. దీనిపై పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతున్న అధికారులు పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. చివరి ఎకరాకూ నీరు అందించేలా చర్యలు చేపట్టారు. అవసరమైన చోట వారాబందీ ఏర్పాటు చేసి కాలువ చివరి భూముల వరకూ నీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఫలితంగా కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ వర్షపాతం వల్లే..

ఈ సీజన్‌లో రెండు నెలల్లో వర్షపాతం చాలా తక్కువగా ఉండటం, కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ వర్షాలు తక్కువగా నమోదు కావడం వల్ల కృష్ణానది జలాశయాలు ఆశించినంతగా నిండలేదు. ఫలితంగా కొంతమేర నీటి సమస్య ఎదురైంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ ఆయకట్టు ద్వారా ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని ప్రభుత్వం రైతులకు సూచించింది. కృష్ణా డెల్టా విషయానికి వస్తే ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. గత నెల ఏడో తేదీన జరిగిన నీటిపారుదల, వ్యవసాయ సలహామండళ్ల సంయుక్త సమావేశంలో ఆ తేదీ నాటికి వేసిన పంటలకు నీరు ఇస్తామని, తర్వాత వేసేవారు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించిన సంగతి తెలిసిందే.

పెరిగిన పులిచింతల నీటిమట్టం

గతనెల ఏడో తేదీన పులిచింతలలో 21 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అయితే సెప్టెంబర్‌లో పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం పులిచింతలలో 32 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు పట్టిసీమ నుంచి కూడా 20 పంపుల ద్వారా రోజూ ప్రకాశం బ్యారేజీకి ఐదువేల క్యూసెక్కులు ఇస్తున్నారు. శనివారం కూడా ప్రకాశం బ్యారేజి నుంచి 8,500 క్యూసెక్కులు తూర్పు, పశ్చిమ డెల్టాలకు విడుదల చేశారు. పశ్చిమ డెల్టాకు 3,800 క్యూసెక్కులు విడుదల చేశారు.

మరో 15 రోజుల వరకు పట్టిసీమ నుంచి నీరు

తూర్పు డెల్టాలో పంటలు ముందుగా వేయడం, పంట పొట్ట దశకు చేరుకోవడంతో నీటి అవసరం ఎక్కువగా ఉంది. పశ్చిమ డెల్టాలో ఇప్పుడిప్పుడే పొట్టదశకు చేరుకుంటోంది. ఇప్పటి నుంచి మరో పదిరోజుల పాటు సరిపడా నీటి సరఫరా ఉంటే రైతులు గట్టెక్కుతారు. దీంతో పట్టిసీమ నీటితో పాటు పులిచింతల నుంచి కూడా రోజూ ఐదు వేల క్యూసెక్కుల వరకూ నీటిని విడుదల చేస్తున్నారు. మరో పదిహేను రోజుల వరకూ పట్టిసీమ నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో డెల్టాలో పంటలను కాపాడుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. పట్టిసీమ నుంచి 7,080 క్యూసెక్కులు విడుదల చేస్తుంటే ఇక్కడికి ఐదు వేలపైచిలుకు మాత్రమే వస్తోంది. మధ్యలో పంటల కోసం మోటార్లు పెట్టడం కూడా సమస్యగా మారింది. దీనిపై తనిఖీల కోసం జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

తాగునీటి అవసరాలకూ వినియోగం

గుంటూరు కార్పొరేషన్, తెనాలి, బాపట్ల, చీరాల పట్టణాల తాగునీటి అవసరాలకూ ప్రకాశం బ్యారేజ్ నుంచి విడులయ్యే నీరే ఆధారం. దీనివల్ల కొంత నీటి ఎద్దడి కనిపిస్తోంది. 4,500 క్యూసెక్కులు విడుదల చేసిన సమయంలో సమస్య రావడం లేదు. అంతకంటే తక్కువ నీటిని విడుదల చేస్తే మాత్రం శివారు పొలాలకు సాగునీరు అందట్లేదు. ఈ సమయంలో వారాబందీ ఏర్పాటు చేసి వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అధికారులు సమాచారం అందిస్తున్నారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కూడా ఎప్పటికప్పుడు ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో పరిస్థితిపై సమీక్ష జరుపుతున్నారు.

మూడునెలలుగా వర్షపాతం ఇలా.. (మిల్లీమీటర్లు)

నెల	సాధారణం	కురిసింది
ఆగస్టు	164.7	102.7
సెప్టెంబర్	145.2	202.3
అక్టోబర్	129.4	14.5 (ఇప్పటివరకు)

కృష్ణాపశ్చిమ డెల్టాలో సాగు ఇలా(ఎకరాల్లో)..

మొత్తం ఆయకట్టు	ప్రస్తుతం ఖరీఫ్ సాగు
5,71,351	4,63,000

ఇబ్బంది లేకుండా చర్యలు

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఎక్కడా పంటలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఎక్కడ నీటి ఎద్దడి ఉందని సమాచారం వచ్చినా వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నాం. వారు కూడా స్పందిస్తున్నారు. డెల్టాలో పంటకు అవసరమైన నీరు అందుబాటులో ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ ఎస్‌ఈ

జగజ్జననీ నమో



బాలాత్రిపురసుందరిదేవిగా కటాక్షిస్తున్న భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని: పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు భ్రమరాంబ అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామున 5 గంటలకు సుప్రభాతసేవ, హారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్యం, నవావరణ పూజలు జరిగాయి. అర్చకస్వాములు ఉభయదాతలచే పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు భ్రమరాంబ అమ్మవారికి కుంకుమార్చనలు, 6 గంటలకు హారతులు, ఆలయ ప్రదక్షిణ, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆలయానికి అధికసంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. అనంతరం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు అలరించాయి. సోమవారం భ్రమరాంబ అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమివ్వనున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో రాణించాలి

మహిళా రైతులను అభినందించిన ఆత్మ ఇన్‌చార్జి పీడీ రామాంజనేయులు



మాట్లాడుతున్న రామాంజనేయులు, వేదికపై రాజకుమారి, అమలకుమారి

కొరిటెపాడు(గుంటూరు): పొదుపు సంఘాల ద్వారా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహిళలు ప్రకృతి వ్యవసాయంలోనూ రాణించాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ పి.రామాంజనేయులు అన్నారు. 'మహిళా కిసాన్ దివాస్' సందర్భంగా ఆత్మ, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కృషి భవన్‌లో ఆదివారం మహిళా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెట్టుబడి లేని వ్యవసాయం (జడ్‌బీఎన్‌ఎఫ్) చిత్ర నమూనా గురించి మహిళలకు అవగాహన కల్పించారు. పీడీ రామాంజనేయులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలతో పాటు వ్యవసాయ రంగంలోనూ రాణించడం అభినందనీయమన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళా రైతులను ప్రోత్సహించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులతో పాటు, అధిక దిగుబడులు సాధించవచ్చని స్పష్టం చేశారు. ప్రకృతి వ్యవసాయం గుంటూరు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 20 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా మహిళలు ఏవిధంగా సంఘాలు ఏర్పాటు చేసుకుంటున్నారో అదే మాదిరిగా మహిళా రైతులు కూడా సంఘాలుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూసారాన్ని పరిరక్షించుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

రసాయన మందులతో అవసరం లేకుండా సేంద్రీయ పంటలతో పండించిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రముఖ దంత, చర్మ వ్యాధుల డాక్టర్లు భాగ్యలక్ష్మి, నాగేశ్వరమ్మ మాట్లాడుతూ మొక్కకు మట్టి ఎంత అవసరమో మనిషికి పురుగు మందుల అవశేషాలు లేని మంచి ఆహారం అంతే అవసరమన్నారు. మనం తీసుకునే ఆహారంతోనే మన ఆరోగ్యం బాగుంటుందని వారు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరం

- పేదరిక నిర్మూలనకు అదే చక్కని పరిష్కారం
- అభినందన సభలో మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి



అప్పిరెడ్డి, సురేష్‌కుమార్‌లను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పేద ప్రజల అభ్యున్నతి కోసం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావల్సిన చారిత్రక అవసరాన్ని గట్టిగా చాటి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని శాసనమండలి మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన లేళ్ల అప్పిరెడ్డి అభినందన సభను బండ్ల పున్నారావు అధ్యక్షతన నిర్వహించారు. తాడికొండ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, ఎంపీపీలు, మార్కెట్ యార్డు చైర్మన్లు, మాజీ చైర్మన్లు, జేసీఎస్ మండల కన్వీనర్లు, ముఖ్య నేతలు పాల్గొని లేళ్ల అప్పిరెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ రానున్నవి పేదల జీవితాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టనున్న ఎన్నికలని అన్నారు. ఆ ఎన్నికల్లో పెత్తందారుల పక్షాన అన్ని రాజకీయ పార్టీలు ఏకమై సర్వశక్తులు ఒడ్డుతున్నాయనీ, పేదల వైపు జగనన్న ఒంటరి పోరాటం చేస్తున్నారని చెప్పారు. పేదల బ్రతుకులను ఉద్ధరిస్తున్న వై.ఎస్.జగన్ పక్షాన నిలబడడం ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని రకాల వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చడమే కాక జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట గ్రామ గ్రామాన ఇంటింటికీ అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారని వివరించారు.

నమ్ముకున్న వారికి తప్పక న్యాయం

విధేయత, విశ్వసనీయతతో పార్టీని నమ్ముకుని ఉంటే వారు ఎక్కడ ఉన్నా పదవులు వాటంతటవే వచ్చి వారి ఇంటి తలుపు తడతాయని తెలిపారు. పదవులు అలంకారప్రాయం కాదన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. పదవి ఏదైనా అది మన బాధ్యతను మరింత పెంచేలా దాన్ని స్వీకరించాలన్నారు. తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్ మాట్లాడుతూ, అప్పిరెడ్డిని తాము రాజకీయంగా అన్ని అంశాల్లో అనుసరిస్తుంటామని తన వంటి ఎందరికో ఆయన రాజకీయంగా పెద్ద దిక్కు అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ముందుగా మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కత్తెర సురేష్‌తో కలిసి లేళ్ళ అప్పిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, కొప్పుల శేషగిరి, తాళ్ళూరి వంశీ, మార్పుల శివరామిరెడ్డి, తాడికొండ యార్డు చైర్మన్ చిమటా పూర్ణయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీ బుల్లా, చిట్టా అంజిరెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన దక్షిణ భారత మానసిక వైద్యుల వార్షిక సదస్సు



మాట్లాడుతున్న వక్తలు

నగరంపాలెం: స్థానిక ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో దక్షిణ భారత మానసిక వైద్యుల 56 వ వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది. ప్రమాదాలు జరిగాక వచ్చే మానసిక సమస్యలపై ప్రముఖ మానసిక వైద్యులు అశోక్‌పాయ్ (ఆస్ట్రేలియా), సీరియల్ కిల్లర్స్ మనస్తత్వంపై వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, మానసిక ఒత్తిడికి గురైన వారు పూనకాలు, అర్ధాంతరంగా వచ్చే మరుపు, హిస్టీరియా, స్పృహ కోల్పోవడం వంటి డిసోసియేటివ్ మానసిక రుగ్మతలపై వైద్యులు ఎస్.ఎన్.రాజు ప్రసంగించారు. సదస్సులో దక్షిణ రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది మానసిక వైద్యులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. దక్షిణ భారత దేశ మానసిక వైద్య విజ్ఞాన సదస్సు ముగింపు సభలో నూతన అధ్యక్షులు, వైద్యులు అభయ మట్కర్, కార్యవర్గ సభ్యులు సదస్సుని విజయవంతం చేశారు. అనేక నూతన పరిశోధన ఫలితాలను చర్చించడంతో వైజ్ఞానికంగా ఉపయోగపడిందని వక్తలు వెల్లడించారు. నిర్వాహక సంఘం అధ్యక్షుడు, వైద్యులు ఐవీఎల్ నరసింహారావు , కార్యదర్శి వైద్యులు ఇవటూరి శరత్ చంద్ర, కోశాధికారి ఐ.శ్రీరమ్యను అభినందించారు.

ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించాలి

రాష్ట్ర సదస్సులో వక్తలు



సభలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

పాత గుంటూరు: ప్రజల ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో వైద్యం- ప్రజారోగ్యంపై రాష్ట్ర సదస్సు ఆదివారం నిర్వహించారు. సదస్సుకు ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తల నివేదికల ప్రకారం మానవాభివృద్ధిలో విద్య, వైద్యం ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రాజ్యాంగంలో విద్య మాదిరిగా వైద్యాన్ని కూడా ప్రాథమిక హక్కుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య విధానాలు- ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై ప్రసంగించారు. ఆరోగ్యం అంటే రోగం లేకుండా ఉండటం కాదని, సామాజిక, ఆర్థిక, మానసిక పరిస్థితులు బాగుండటం అని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణలు అమల్లోకి వచ్చినప్పటి నుంచి దేశంలో వైద్యం బాధ్యత నుంచి ప్రభుత్వాలు తప్పుకుంటూ, హెల్త్ ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. డాక్టర్ కె.సాయి ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి.రమణయ్య, టి.కామేశ్వరరావు, పాశం రామారావు, డాక్టర్ గొంది శివరామకృష్ణ, ఎల్.ఎస్.భారవి, కె.నళినీకాంత్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అంధత్వ సమస్యకు పరిష్కారం

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- నాలుగు గ్రామాల్లో నేత్ర జ్యోతి వైద్య శిబిరం
- 897 మందికి నేత్ర వైద్య పరీక్షలు



శిబిరం వద్ద బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శేకూరు(చేబ్రోలు): ప్రతి ఒక్కరూ తరచూ కంటి పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటే అంధత్వ సమస్య రాకుండా అడ్డుకోగలమని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా చేబ్రోలు మండలం శేకూరు, వీరనాయకుని పాలెం, పెదకాకాని మండలంలోని అనమర్లపూడి, తంగెళ్ళమూడి గ్రామాలలో బజరంగ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన నేత్ర జ్యోతి కంటి పరీక్ష శిబిరాన్ని ఆదివారం అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కంటిచూపు చాలా ముఖ్యమైందన్నారు. చాలామంది వెనుకబడిన వర్గాల వారు కార్మిక, కర్షక, గ్రామిక వర్గాల ప్రజలు కంటి సమస్యలని చిన్న సమస్యలుగా భావించి పరీక్షలు చేయించుకోక పోవడం వల్ల అతి పెద్ద సమస్య అంధత్వం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల బజరంగ్ ఫౌండేషన్ మానవీయ కోణంలో ప్రత్యేకించి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల కోసం వారు అధికంగా ఉన్న గ్రామాలలో ఈ నేత్ర జ్యోతి వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తాము ఇచ్చే ఒక కళ్లజోడు వారి జీవితాలను మార్చి వేస్తుందని ఇది వర్తమాన కాలంలో కంటి సమస్యలకు పరిష్కారం చూపి రంగుల ప్రపంచాన్ని సాక్షాత్కారం చేయడంతో పాటు భవిష్యత్‌లో రాబోయే అంధత్వ సమస్యకు అడ్డుగోడగా నిలుస్తుందన్నారు. ఏళ్ల తరబడి దగ్గర వస్తువులు దూరం వస్తువులు మనుషులు సరిగా కనబడక మసకతో ఇబ్బందులు పడుతూ, బజరంగ్ చొరవతో కంటిచూపును తిరిగి పొందిన వారి కళ్లల్లో కనిపించే సంతృప్తి ముఖ్యమని బజరంగ్ ఫౌండేషన్ నేత్ర జ్యోతి కార్యక్రమంలో అంతర్లీనంగా ఉన్న భావోద్వేగం ఇదేనన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుల, మత, వర్గ, వర్ణ రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పాలన స్ఫూర్తితో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరం సేవా కార్యక్రమాల పరంపర కొనసాగుతుందన్నారు. నేత్ర జ్యోతి శిబిరాలను నేరుగా గ్రామాల్లోని ప్రజల ఇంటి వద్దనే ఏర్పాటు చేసి ముందుగా వారికి నిపుణులైన వైద్యులచే కంటి పరీక్షలను జరిపించడం కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి ఏడు రోజుల్లోగా కళ్లజోళ్లను అందించడం జరుగుతుందని వివరించారు. ఆదివారం జరిగిన నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో 897 మందికి నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. ట్రికాన్ క్లినిక్స్ గుంటూరు వారి సహకారంతో గ్రామాల్లోని ప్రజలకు ఫిజియోథెరపీ సేవలను అందించారు.

ఆచరణ బజరంగ్-అంకితం జగనన్నకు బిందువులా మొదలై సింధువులా విస్తరిస్తున్న బజరంగ్ సేవా కార్యక్రమాల పరంపర గత మూడేళ్లగా కొనసాగుతోందని అయితే గత డిసెంబర్ 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు నుంచి ఈ ఏడాది డిసెంబర్‌లో ఆయన పుట్టినరోజు వరకు జగన్నామ సంక్షేమ సంవత్సరంగా నిర్దేశించుకుని కార్యాచరణ కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవపస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సంక్షేమ పాలనను ప్రతిబింబించే విధంగా నెరవేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారి సోనీ బాధ్యత బజరంగ్‌దే...

అతి చిన్న వయస్సులోనే కంటి సమస్యతో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారి సోనీ ప్రవచన బాధ్యతను బజరంగ్ ఫౌండేషన్ తీసుకుంటుందని అంబటి మురళీకృష్ణ తెలిపారు. నేత్ర జ్యోతి వైద్య శిబిరానికి వచ్చిన చిన్నారి శుక్లం ముదిరి పోవటంతో చూపు సమస్యను ఎదుర్కొంటున్నట్లు వైద్యులు గుర్తించారు. ఆ బాలికకు శుక్లం ఆపరేషన్ తో పాటు తదుపరి వైద్య చికిత్సలను బజరంగ్ ఫౌండేషన్ పూర్తి బాధ్యత తీసుకోవాలని నిర్ణయించినట్లు అంబటి తెలిపారు.

ఎన్ఆర్ఐ ఘరానా మోసం

- భార్యను వదిలి విదేశాలకు పరార్
- కోటి ఇస్తే కాపురం చేస్తానంటూ బెదరింపులు
- కోడల్ని బయటకు గెంటేసిన అత్తమామలు
- తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: విదేశాల్లో స్థిరపడ్డ ఓ యువకుడు ఓ డాక్టర్‌ను కులాంతర వివాహం చేసుకుని అనంతరం కోటి రూపాయలు ఇస్తేనే కాపురం చేస్తానంటూ విదేశాలకు పారిపోయి, భార్యను మానసికంగా వేధిస్తున్నాడు. ఇదే సమయంలో అత్తమామలు సైతం డాక్టర్ కోడల్ని ఇంట్లోంచి బయటకు గెంటేసి హైదరాబాద్ వెళ్లిపోయారు. ఎస్ఐ వినోద్ కథనం ప్రకారం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో నివాసముండే ఆయుర్వేద డాక్టర్ నీరజా లక్ష్మికి విజయవాడకు చెందిన ఎన్ఆర్ఐ ఇందుపల్లి అవినాష్ బాబుతో కొన్ని సంవత్సరాల క్రితం కులాంతర వివాహం పెద్దల సమక్షంలో జరిగింది.

వివాహ సమయంలో ఇందుపల్లి అవినాష్‌బాబు విజయవాడలోనే నివాసముండేవాడు. పెళ్లి అయిన తరువాత భార్యను శరీర ఛాయ గురించి పదేపదే మాట్లాడడం, అత్తమామలు కూడా శరీర తత్వాన్ని గురించి ఆమెను వేధించేవారు. ఒకదశలో నీతో మా కొడుకు కాపురం చేయాలంటే కోటి రూపాయలు ఇవ్వాలని అత్త పద్మ, మామ సోమశేఖరరావు, బావ రాజేష్‌లు వేధింపులకు పాల్పడేవారు.

ఇదిలా ఉంటే కొంతకాలం క్రితం అవినాష్‌బాబు భార్యకు చెప్పకుండా కెనడాకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి భర్తకు ఫోన్ చేస్తున్నా ఎటువంటి సమాధానం రాలేదు. అందరితో కలసి కలసి ఉంటున్న సమయంలో కొన్ని డాక్యుమెంట్స్ తీసుకు వచ్చి సంతకం పెట్టమని అత్తమామలు, బావ బలవంతం చేశారు. దేనికి అని అడిగితే సమాధానం చెప్పలేదు. ఆ పత్రాలను పరిశీలించగా నీరజ లక్ష్మి పేరుమీద కోటి రూపాయలు హౌసింగ్ లోన్ తీసుకునేందుకు అని గ్రహించి సంతకం పెట్టనని చెప్పింది. దీంతో అత్తమామలు తనపై దాడికి పాల్పడ్డారని, తనకు కనీసం భోజనం కూడా పెట్టకుండా వేధించేవారని ఫిర్యాదులో వాపోయింది. తాజాగా తాను ఆసుపత్రికి వెళ్లిన సమయంలో అత్తమామలు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారనీ, ఫోన్ చేసినా వారి వద్ద నుంచి ఎటువంటి సమాధానం లభించడం లేదని వివరించింది. ప్రస్తుతం నీరజ లక్ష్మి తల్లిదండ్రుల దగ్గరే నివాసముంటోంది. నెలరోజుల పాటు వారి కోసం ప్రయత్నం చేసి చివరకు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యర్రబాలెంలో బంగారు నగలు చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో సుమారు రూ.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల మేరకు శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న హుస్సేన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 9న విశాఖపట్నంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఈనెల 14వ తేదీ రాత్రి శ్రీనగర్ కాలనీలోని ఇంటికి చేరుకోగా తలుపులు పగలకొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు తెలుసుకుని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న కాలనీలో వార్షికోత్సవం



మంగళగిరి: నగరంలో ఆటోనగర్‌లోని వైఎస్సార్ జగనన్న కాలనీ (టిడ్కో ఇళ్లు)లో ఆదివారం తొలి వార్షికోత్సవం ఆనందంగా నిర్వహించారు. ఆదివారంతో తాము జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు నిర్వహించి ఏడాది పూర్తిచేసుకున్న స్థానికులు కాలనీని విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలిపేలా అలంకరించి కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచుకుని వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విదేశీ దాడులు


- గంగలో విషనాగులు పుస్తకావిష్కరణలో మాజీ డీజీపీ అరవిందరావు



పుస్తకావిష్కరణలో మాజీ డీజీపీ అరవిందరావు

గుంటూరు వెస్ట్: విశాలమైన సంస్కృతి, సంప్రదాయాలకు, మానవత్వ విలువలకు, విజ్ఞానానికి నిలయమైన భారత్‌పై కొన్ని విదేశీ శక్తులు పనిగట్టుకుని విషం చిమ్ముతున్నాయని మాజీ డీజీపీ అరవిందరావు పేర్కొన్నారు. ఆదివారం థింక్ సంస్థ ఆధ్వర్యాన గుంటూరులోని బ్రాహ్మణ సమితి కార్యాలయంలో నిర్వహించిన గంగలో విషనాగులు పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ కొన్ని శతాబ్దాల నుంచి మన దేశంపై విదేశీ సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇటీవల కాలంలో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో కొందరు మనపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. మన దేశంలో కూడా కొందరు స్వయం ప్రకటిత మేధావులు ఇందులో భాగస్వాములు కావడం దురదృష్టకరమన్నారు. హిందూత్వంలో కుల వ్యవస్థ లేదని, ఉన్నదంతా పరమత సహనం, ప్రేమ, దయ మాత్రమేనని చెప్పారు. నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాలపై పట్టు సాధించాలన్నారు. పుస్తక రచయితలు సారంగపాణి, ఎం.సుధామోహన్‌లు మాట్లాడుతూ రాజీవ్ మల్హోత్రా, విజయ విశ్వనాథన్ రచించిన స్నేక్స్ ఇన్ ది గంగా (బ్రేకింగ్ ఇండియా-2) ఆంగ్ల పుస్తకాన్ని సంక్షిప్త రూపంగా తెలుగులోకి అనువదించామని తెలిపారు. అనంతరం అరవిందరావు, సారంగపాణి, ఎం.సుధామోహన్, దుగరాజ్ భండారీ, సీనియర్ జర్నలిస్ట్ సాయి, థింక్ సంస్థ నిర్వాహకులు డీఎస్ఆర్ మూర్తి పుస్తకావిష్కరణ చేశారు. సీహెచ్.బుచ్చిరాజు, సీహెచ్.రాఘవాచారి కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రికెట్ కప్ విజేత డీఆర్ఎం-11



డీఆర్ఎం- 11 జట్టుకు ట్రోఫీ, రూ.75 వేల చెక్కు అందజేస్తున్న డీఆర్ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: డీఆర్ఎం క్రికెట్ కప్‌ను గుంటూరు రైల్వే డీఆర్ఎం- 11 జట్టు కైవసం చేసుకుంది. స్థానిక నల్లపాడు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో పల్నాడు పోలీస్ జట్టు, గుంటూరు రైల్వే డీఆర్ఎం-11 జట్టు ఆదివారం తలపడ్డాయి. ఉత్కంఠగా జరిగిన పోటీలో రైల్వే డీఆర్ఎం జట్టు విజయం సాధించింది. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. జీఎస్టీ కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలతో పాటు క్రీడా రంగంలో కూడా గుంటూరు రైల్వే డివిజన్ ముందంజలో ఉండటం సంతోషకరంగా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ అన్ని రంగాలలో తమ నైపుణ్యతను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతరం ఉద్యోగ బాధ్యతలతో సతమతమవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆయా శాఖల సిబ్బంది, అధికారులు ఏడాదిలో రెండు సార్లు అయిన ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం వల్ల వారిలో మరింత పోటీ తత్వం పెరుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల మధ్య స్నేహ సంబంధం మరింత బలోపేతం చేసేందుకు డీఆర్ఎం కప్‌ను ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేసిన గుంటూరు రైల్వే డీఆర్ఎంను అభినందిచారు. గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ మాట్లాడుతూ డీఆర్ఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించడం చాలా సంతోషదాయకం ఉందన్నారు. క్రీడా పోటీలకు ప్రణాళికను రూపొందించిన సీనియర్ డీసీఎం ఎం.దినేష్ కుమార్ కృషి అభినందనీయం అన్నారు. పోటీలలో ప్రధానంగా షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో మొత్తం 32 జట్లు వాలీబాల్ పోటీలలో 16 జట్లు ఆడాయి అన్నారు. మొదటి నాలుగు స్థానాలలో గెలుపొందిన జట్టులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు డీఆర్ఎం సతీమణి ఆశాలత, ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీసీఎం దినేష్ కుమార్, సీనియర్ డిఎస్‌టిఈ బి.లక్ష్మణ్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ రైల్వే ఆస్పత్రి డాక్టర్ రాజు, సీనియర్ సీఎస్‌సీ కె.హరప్రసాద్, సీనియర్ డీఓఎం కిరణ్‌కుమార్, సీనియర్ డీఎంఈ ఆర్‌డీ శ్రీహర్ష, డీసీఎం కమలాకర్‌బాబు, స్పోర్ట్స్ అధికారి గీత పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో మొత్తం 32 జట్లు పోటీలో పాల్గొన్నాయన్నారు. తుది ఫలితాలలో మొదటి స్థానంలో విజయ్‌సాయిరెడ్డి, జి జితేంద్ర(గుంటూరు), ద్వితీయ స్థానంలో సిద్ధార్థ గౌతం, జయంత్‌లజట్టు, తృతీయ స్థానంలో అబ్బాస్, ఎస్ఐ జట్టు, నాలుగవ స్థానంలో జా రా జ్‌పాల్, షేక్ రియాజ్(రైల్వేస్)జట్టు నిలిచాయన్నారు. వాలీబాల్ పోటీలలో మొత్తం 16 జట్లు పాల్గొనగా అందులో మొదటి స్థానంలో యూనిక్ స్పోర్ట్స్‌వరల్డ్ జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో గుంటూరు రైల్వేస్ జట్టు, తృతీయ స్థానంలో గుంటూరు పోలీస్ జట్టు, నాలుగో స్థానంలో తెనాలి జట్టు నిలిచాయి. పోటీలలో విజేతలకు ట్రోఫీలు, బహుమతులు, నగదు బహుమతులు అందజేశారు.